


# కథ మాత్రం కాదు

నందం రామారావు

బొమ్మ: శ్రీ బాపు

జానకీ, రాధ గదిలో కూర్చుని మాట్లాడు కుంటున్నారు. జానకి మధ్య మధ్య కిటికీ లోంచి బయటకు చూస్తోంది.

జానకి చివాల్న లేచి—

'ఇప్పుడే వస్తాను రాధా వుండు' అని వరండాలోకి వెళ్ళింది.

ప్రసాదం వరండాలో అడుగు పెట్టగానే జానకి, రాజా ఎదురువచ్చి రాధ కూర్చున్న గదివేపు చూపించారు.

ప్రసాదం మెల్లిగా లోపలికి అడుగు పెట్టాడు.

కుర్చీలో కూర్చున్న రాధను చూసి ప్రసాదం ఆనందించాడు.

రాధ హఠాత్తుగా లేచి లోపలికి వెళ్ళిపోయింది!

ప్రసాదం వెనకా ముందూ ఆలోచించకుండా ఆమె వెనుగ్గా వెళ్ళి—

'కులాసాగా వున్నావా?' అన్నాడు.

రాధ మాట్లాడలేదు!

'కులాసాగా వున్నావా?' అన్నాడు మళ్ళీ గాలివానలోనుంచుని మాట్లాడి నట్లుగా వినిపించిదా పలకరింపు.

ఈసారి కూడా రాధ మాట్లాడకపోయే సరికి ప్రసాదం బాధపడ్డాడు. అయినా ఏదో ఆశ అతని గుండెల్లో వెలుగుతుంది. రాధతో మాట్లాడ్డంకోసం అతనెన్నోరోజులు ఎదురు చూశాడు. చివరకది రాజా జానకీల ద్వారా నెరవేరింది.

ప్రసాదాన్ని రాజా గమనిస్తూనేవున్నాడు లోజు. అతని విషయాలన్నీ రాజాకు పూర్తిగా తెలుసు. అతని మనస్తత్వమూ తెలుసు.

'రోజురోజుకిలా అయిపోతున్నావేమిట్రోయ్' అని రాజా అడగ్గా—

'రాధకోసమే బ్రతుకుతున్నానేమో నని పిస్తోంది. ఇవాళ రాధ నన్ను దూరం చేస్తుంటే బాధగా వుంది.' అన్నాడు ప్రసాదం

'అదోలా మాట్లాడుతున్నావ్?'

'కాదు. నిజమే చెబుతున్నాను. ఈ వారి పెంతుల్లో ఒక్కసారి రాధను తప్పకుండా కలుసుకోవాలి. నన్ను దూరం చేసుకుంటు న్నందు క్కారణం అడగాలని వుంది.'

'ఇంత జరిగినతర్వాత నీతో మాట్లాడు తుందనే నమ్మకం ఏమిటి?'

'అందుకు నీ సాయం కావాలి. కాదనకు.'

'అంటే?'

'రాధను కలుసుకునే ఏర్పాటు నువ్వు చేయగలవు. అది నీవల్లే అవుతుంది. ప్లీజ్. కాదనకు. మీ చెల్లెలు జానకికి రాధ స్నేహితురాలు. రాధని మీ యింటికి పిలు. ప్లీజ్ రాజా...'

రాజా చేసిన సాయంవల్లనే ఆ రోజు అతను రాధను చూడగలిగాడు.

చివరికి రాధ అన్నది—

'నా ఉత్తరాలన్నీ చింపలేదు. కొన్ని అట్టే పెట్టుకున్నాగేం?'

ఊహించని ఈ ప్రసక్తికి ప్రసాదం దెబ్బ తిన్నాడు.

రాధను గురించి అతనికెన్నో కలలున్నాయి—

తనని చూసి రాధ సిగ్గుపడుతుంది. తలెత్తుకోలేదు. తను — 'కులాసాగా వున్నావా?' అంటాడు.

తన ముఖంలోకి చూసి రాధ ఒక్కసారి ఏడుస్తుంది.

'రాధా' అంటాడు గాద్గదికంగా.

'నన్ను క్షమించండి. మిమ్మల్ని అర్థం చేసుకోలేకపోయాను. నేను పాపిని' అని కాళ్ళమీద పడుతుంది.

రాధను లేవనెత్తి—'రాధా' అంటూ సంతోషంగా తనలోకి తీసుకుంటాడు.

ఆ కలల్లో ముఖ్యమైన కల ఇది.

ఈ సుందరమైన దృశ్యాన్నే అతను రంగుల్లో అందంగా, చాలా ఎత్తుగా పెంచు కుంటూ వచ్చాడు.

కాని, ఇప్పుడు రాధ ?

అతని రంగు రంగుల స్వప్నాలన్నీ ఒక్కొక్కటిగా కరిగిపోతున్నాయి. ప్రసాదం కళ్ళు చెమర్చాయి.

'ఇవన్నీ ఏనాడో కాల్చేశాను రాధా. మిగిలినవన్నీ నీకే పంపాను. నన్ను దూరం చేయకు. నేను బతకలేను.' పిచ్చిగా ఆమెను చూస్తూ అరిచాడు ప్రసాదం.

'వెళ్ళిపోండి ప్రసాదం. ప్లీజ్ వెళ్ళిపోండి. ఒక్కక్షణం కూడా ఇక్కడుండొద్దు' అంది రాధ. కళ్ళు తుడుచుకుంటూ గబ గబ మరోగదిలోకి వెళ్ళిపోయింది.

ప్రసాదం నిశ్చేష్టుడయ్యాడు!

ఎన్నో కత్తులు ఒక్కసారిగా శరీరంలోకి దిగిపోయినంతగా బాధపడ్డాడు. నరాలన్నీ ఫట్ మని తెగిపోయినట్టుగా కృంగిపోయాడు. ముఖం పీనంగా మారిపోయింది. కొన్ని నిముషాలు అతను అలాగే చలనరహితంగా వుండిపోయాడు.

'ప్రసాదం! నిన్నే ? ఏమిటిలా ఐపోయావ్!!' రాజా వచ్చి భుజం తట్టాడు. ప్రసాదం ఉలిక్కిపడి —

'ఏం లేదు నేను వెళ్ళిపోతున్నాను రాజా!' అన్నాడు.

'అసలేం జరిగింది ?'

రాజా ప్రసాదం చెయ్యి పుచ్చుకుని హోటల్లోకి దారితీశాడు. ఇద్దరూ కుర్చీలో కూర్చున్నారు రాజా ఆర్డరిచ్చాడు. ప్రసాదం సిగరెట్టు వెలిగించి జరిగింది చెప్పాడు.

* * *

బి. ఏ. పరీక్షలు దగ్గరపడ్డాయి.

ఆనాటి గ్రూప్ ఫోటో, టీపార్టీ ఏర్పాట్ల బాధ్యతని అతను పుచ్చుకున్నాడు.

చాలా సందడిగా, ఆనందంగా గడిచింది ఆ రోజు. ప్రసాదం కోరగా రాధ ఒక చక్కటి పాట కూడా పాడింది. ఎంత తియ్యగా పాడిందనీ! అంత చక్కటి పాటని కేవలం అతనికోసమే పాడినట్టు ప్రసాదం గర్వించాడు.

ఆ రోజు పార్టీ ముగిసిం తర్వాత రాధను వాళ్ళింటి దగ్గర దిగబెట్టి — గాలిలో తేలిపోతూ ఇంటికి వెళ్ళిపోయాడు ప్రసాదం.

ప్రసాదం అంటే రాధింట్లో అందరికీ గౌరవం.

వాళ్ళింట్లో ఇద్దరూ కూర్చుని గంటల తరబడి ఎన్నో విషయాలు—కాలేజీ గురించి, సినిమాలూ, కథలూ గురించి మాట్లాడుకునే వారు. ఎక్కువగా కథలు గురించే వాళ్ళిద్దరి మధ్య చర్చసాగేది.

ఓ రోజు మాటల్లో రాధ అన్నది—

'నువ్వంటే నాకిష్టం. నువ్వు మా ఇంటికి రాని రోజు నాకేం తోచదు. నువ్వు నవ్వనంటే నేనో విషయం చెబుతాను — నవ్వుతావా ?'

'నవ్వను. చెప్పు'

'నువ్వు నా కనిపించని రోజుమీద అధికారం వుండాలే గాని—ఆ రోజుని కొన్నివేల సంవత్సరాల కవతల కి విసిరేద్దామని వుంటుంది. ఆ దరిద్రగొట్టు రోజుమీద ఇన్ని నిప్పులుపోసి కాల్చిపారేద్దామని పిస్తుంది. నిజం ఇది.'

ప్రసాదం మాట తప్పి గలగలా నవ్వేశాడు.

రాధ తలదించు కున్నది.

ప్రసాదం రాధ ఆవేశానికి ఆశ్చర్య పోయాడు.

ఓ అందమైన ఆడకూతుర్లో ఇంతటి ఆవేశమా ?

ఇంతందమైన అభిమానమా ?

రాధనుంచి ప్రసాదానికొచ్చిన ఉత్తరాల్లో చిత్రమైన ఉత్తరం—

ప్రసాదం !

నీతో రోజూ ఎన్నిగంటలు మాట్లాడినా ఇంకా ఇంకా మాట్లాడాలనిపిస్తోంది. చాలా విషయాలు మిగిలిపోయాయనీ అనిపిస్తూంటుంది. ఇవతల నేనేం చెబుతున్నా నువ్వు గంభీరంగా వూరుకుంటావే తప్పించి నోరు మెదపవు. ఇదేం న్యాయం చెప్పు ?

నిన్నటి నా ప్రవర్తనకి ఏమనుకున్నావో? ఏమో ? అసహ్యంగా ప్రవర్తించానా ? తొందరపడ్డానా ? ఏంచెయ్యను— నువ్విలా నా కెదురుగా దేవుళ్ళా కూర్చుంటే మనిషి మొత్తాన్నీ అర్పించుకోవా లనిపిస్తుంది. ఆ తొందర్లో ఏం చేస్తున్నానో ఏమో తెలీకుండా వుంది. క్షమించు.—రాధ.'

అప్పుడనుకున్నాడతను.

'రాధ' నిన్ను పెళ్ళి చేసుకుంటాను. నువ్వు నా సుందరివి. మాటలు నేర్చిన బంగారు చిలకవి. ఊరుచివర చిన్నకుటీరం. అందులో మనిద్దరం అందర్నీమరిచి గడుపుదాం, మనకుటీరం చుట్టూ గులాబీతోట, ఆకుటీరంలో నువ్వుదేవతవి నేను భక్తుణ్ని.

ఆ మాటల్ని రాధతో ఓరోజున అన్నాడు ప్రసాదం.

ఆ మాటలు విన్నరాధ తెల్లబోయింది! చాలా దిగులుగా అన్నది —

'ఎప్పటికయినా నువ్విలా అంటావేమో నని భయపడుతూనే వచ్చాను. అదింత తొందరలో వింటానని అనుకోలేదు. నిన్ను వున్నతమైన వ్యక్తిగా భావించాను. మనకు పెళ్ళొద్దు. పెళ్ళిమాట యింక నాదగ్గర అనకు.' బొటబొట కన్నీళ్ళు జారాయి. ఇంకేం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

ప్రసాదం ఆశ్చర్యపోయాడు రాధలోని ఈ హఠాత్పరిణామానికి కృంగిపోయాడు.

రెండో రోజు రాధనుంచి ఉత్తరం వచ్చింది.

నాగురించి ఆశలు పెంచుకోవద్దు. మనిద్దరి జీవితాలూ, జాతకాలూ చాలా దారుణమైనవని పసిగట్టాను ఇంకెప్పుడు నన్ను కలుసుకోడానికి ప్రయత్నించకు. ప్రయత్నిస్తే చాలాదూరం...అందుకోలేనంత దూరంలో వుండిపోతాను.

సెలవింక
రాధ

ప్రసాదం, రాధను కలుసుకోడానికి చాలా సార్లు ఇంటికివెళ్ళాడు. రాధ కనపించి కూడా మాట్లాడకుండా లోపలకు వెళ్ళిపోయేది!

ఇది జరిగిన కొన్ని రోజులకు ఊహించని విధంగా జరిగింది. ప్రసాదం ఆ షాక్ నుంచి కోలుకోలేక పోయాడు.

కల్పనలు అందంగా అల్లడంకూడా ఒక పెద్ద ఆర్టే! ప్రసాదం రాజా మాట్లాడుకుంటూ వుండగా ఫోన్ మోగింది.

రాజా రిసీవ్ చేసుకున్నాడు. మాటాడింది రాధ వాళ్ళమ్మగారు.

'ప్రసాదాన్ని యింకెప్పుడూ మా ఇంటికి రావద్దనండి. అతన్నింతకాలం చాలా మంచివాడనుకున్నాం. మా అమ్మాయి వెంటబడి అల్లరి చేశాడట. అదేమంత మంచిలక్షణం కాదు.'

'అతనలాటివాడు కాదు'

'మీరలా అనకండి. ఈ విషయం స్వయంగా మా అమ్మాయే చెప్పింది. మీరోసారి మా ఇంటికి రండి మీతో

మాట్లాడాలి. వస్తారా ?'

ఫోన్ పెట్టేశాడు రాజా.

జరిగింది ప్రసాదానికి చెప్పి-

'వాళ్లు గొప్పవారు గురూ! నువ్వేం దిగులు పడకు' అన్నాడు

ప్రసాదం బాగా దెబ్బతిన్నాడు. రాధ తనని ద్వేషించడమెందుకో తెలిసిందిగాదు. అంతగా అభిమానించే రాధ నిష్కారణంగా అతన్ని దూరం చేసుకోడంలోగల కారణమేమిటి?

'బెంగపడకు గురూ! కొందరాడవాళ్లకు కొన్ని సర్దాలుంటాయి. మనుషుల్తో ఆడుకుంటారు వాళ్లు. ఆడుకునేమనిషి ఏడుస్తూ వుంటే నవ్వడం వాళ్లకానందం. వాళ్ల స్వంతమ్మాతాన నువ్వు చెడ్డవాడివికావు. ఈరోజుల్లో మనసులోవి మాటని పైకి చెప్పనేకూడదు. అది పెద్ద నేరం.'

'రాధను ఒక్కసారి కలుసుకోవాలనివుంది. ఆమె నోటిమీదుగానే నామీద ద్వేషమెందుకో వినాలనివుంది.' ప్రసాదం గొంతు పూడుకుపోయింది.

'ఆరోజా వొస్తుంది' అన్నాడు రాజా.

* * *

ఆరాత్రి — ప్రసాదం ఇంటికి బయలుదేరాడు. దారంతా చీకటిగావుంది ఆకాశంలో మబ్బులు పేరుకున్నాయి. ఈదురుగాలి వీస్తోంది.

అతనికి రిక్షా ఎక్కబుద్ది కాలేదు. ఇలా ఇలా నడుస్తున్నప్పుడే దార్లో వర్షం వచ్చి ఆవర్షంలో అతను పూర్తిగాతడిసి ముద్దైపోతుండగా — ఆ స్థితిలోనే రాధ పాటని పాడుకోవాలనిపించింది. నడవడం మాత్రం జరిగిందిగానీ, వర్షం రాలేదు, పాటపాడనూ లేదు.

'రాధ! ఈ దారుణాన్ని భరించలేను. నన్ను దూరం చెయ్యకు రాధా!' అనుకున్నాడతను.

అప్పుడతనికి ఆ స్థితిలో తాగాలనిపించింది.

తలుపు తట్టాడు. తలుపు తెరిచి ప్రసాదాన్ని చూసి రాజా ఆశ్చర్యపోయాడు.

'ఏమిట్రా ?'

'నువ్వు నాకు ప్రాణమిత్రుడివి. అవునా ?'

రాజా కలవరపాటు చెంది—

'అదేం ప్రశ్న?' అన్నాడు.

'అయితే ఒక సహాయం చెయ్, నాకు

కథపూర్తంకాదు

తాగాలనివుంది. మంచి మందు తెచ్చి పెట్టు.'

'ప్రసాదం!' అన్నాడు రాజా.

'అవున్నేనే మాట్లాడుతున్నాను. ఇప్పుడు నాకు బోల్డంత సుఖం కావాలి. ఆ సుఖం తాగడంలో వుందని తెలుసుకొన్నాను. తెచ్చిపెట్టు.'

'నావల్ల కాదు.'

'స్నేహం విలువ ఇటువంటి సమయాల్లోనే తెలిసేది?'

'నువ్వు పాడవడం నేను చూడలేను. తాగేవాళ్లంటే నీక్కోపంకూడాను.'

'అదొకప్పుడు. మనిషి ఎందుకు తాగుతున్నాడో నాకిప్పుడర్థమయింది. ఆ సమయంలో ఇది వారికి అవసరం.' ప్రసాదం మంచంమీద వాలిపోయాడు.

'తెస్తాను ఒక్క షరతు!'

'చెప్పు.'

'నువ్వు మళ్లీ ఎప్పుడూ తాక్కూడదు. ఈ రాత్రికి నా రూమ్‌లోనే వుండిపో. నువ్వు స్థిరంలేని మనిషివి. నువ్వేంచేస్తావో నీకే తెలీడంలేదు'

ప్రసాదం నవ్వాడు.

'రాజా! మనిషి చెడిపోవడమంటే అర్థం నీకు తెలీదు నేనేం అఘాయిత్యం చేసుకోను.



ఈ రాత్రికి హాయిగా నీ గదిలో పడుకుని అందమైన చాలా అందమైన కలలు గంటాను. సరేనా ? వెళ్లిరా ఫ్రెండ్. త్వరగా వెళ్లు.'

రాజా బయటకు వెళ్లి అరగంటలో రూమ్ కొచ్చాడు.

'రాజా ! నీ స్నేహాన్నెప్పుడూ మరవను. నేను తాగుతున్నానని నువ్వు తాగొద్దు' అన్నాడు ప్రసాదం.

ప్రసాదం కుర్చీలో కూర్చున్నాడు. ఎదట మందు వున్నది. జేబులోంచి సిగరెట్ ప్యాకెట్, అగ్గిపెట్టె తీశాడు. వెలిగించాడు. మందువేపు చూశాడు ఫెళ్లున నవ్వాడు. లేచి, గ్లాసులోకి బ్రాందీ వంపుకుని సోడా కలుపుకున్నాడు

'గాడ్! ఈ ఒక్క రాత్రికి నేననే ఈ ప్రసాదం పతన మవుతున్నాడు. కొంచం గానే శిక్ష విధించు'

గడగడ తాగేశాడు.

కొన్ని నిముషాలు బాగానే వున్నాడు. ఆ తర్వాత ప్రసాదానికి గదంతా బూజు పట్టినట్టుగా కనుపించసాగింది. గొంతు మండుతున్నట్టు, నాలుక పీక్కుపోతున్నట్టు, శరీరం యావత్తు ఆకాశంలో ఎగురుతున్నట్టుగా అనిపించింది.

'నమస్కారం సార్! నేను బాగా తాగాను. నే నిప్పుడు భగ్నజీవిని. వొప్పుకుంటాను. రాధనే ఓ అందమైన ఆడపిల్ల నా ప్రేమను అతి దారుణంగా తినేసింది. కనక, నాదగ్గిరింక ప్రేమలేదు. అది భరించలేక తాగాను

రాధ ఈ గదిలోకొచ్చి నన్నిప్పుడు చూడ్డాలా నాతంత్రం... గుండె పగిలేలావేడ్చి — సొమ్మసిల్లి పోగలదు. అంతటి మనిషి తాగకుండానే భూమ్మవి కింద పడిపోగలదు'

ప్రసాదం గ్లాసులోకి ఇంకొంచెం వంపుకుని తాగాడు.

'గుడ్ నైటు మై కలర్ ఫుల్ డ్రీమ్స్ గుడ్ నైటు మై స్వీట్ హార్ట్! అండ్ గుడ్‌నైటు మై రిచడ్ లవ్ !'

రాజా లేచేటప్పటికి ప్రసాదం విచారంగా కూర్చున్నాడు. కళ్లు బరువుగా వున్నాయి. ముఖమంతా పీక్కుపోయింది. మోకాళ్లమీద తల ఆన్చి చేతుల్తో జుట్టు పీక్కుంటున్నాడు.

'ప్రసాదం.'

ప్రసాదం తలెత్తిచూచి నలవంగా అన్నాడు—

రాజా! నువ్వు కథలు బాగారాస్తావ్. నువ్వు ఎందరిగురించో ఎన్నెన్నో కథలు రాశావు. కాని రాధలాటి ఆడకూతురు నీకెక్కడా తగిలివుండదు. నువ్వు రాధ కథ రాసినా ఎవడూ కథని నమ్మడు. ఉత్త అభూతకల్పన—గాన్ అనేస్తాడు. ఎంచేత? నీకుగానీ, చివరికి రాధని ప్రేమించిన నాకుగానీ, రాధ ఎందుకిలా అకారణంగా ప్రేమని ద్వేషించిందో తెలీదు. ఆల్‌రైట్. నీకు రాధ ఎక్కడైనా కనుపిస్తే చెప్పు— ప్రసాదం మరిజన్మలో నీకు దగ్గరగా రాడని అంతే. వస్తారా రాజా! గుడ్‌బై' చిన్న పిల్లాడిలా ముఖం చేతుల్లో కప్పుకున్నాడు.

గబగబా బయటకు వొచ్చేశాడు.

* * *

ఇది జరిగిన ఒక సంవత్సరానికి—

రాజుకు పెదవ స్టేషన్లో ప్రసాదం కనిపించాడు.

అతన్ని రాజా పిలిచాడు.

ప్రసాదం, రాజాను చూసి ఆశ్చర్యపోయి— 'నువ్వేమిటిరా ఇక్కడున్నావ్' అన్నాడు.

'మా అక్కయ్య వాళ్లను చూడ్డాని కొచ్చాను. ఇంతకాలం నువ్వెక్కడున్నట్టు?'

ప్రసాదం పేలవంగా నవ్వాడు.

'భిలాయ్‌లో బ్రతుకుతున్నాను. అవున్నా రాజా! రాధ పెళ్లిచేసుకుందా?' కుతూహలంగా అడిగాడు.

రాజా నెమ్మదిగా చెప్పాడు.

'ఆరోజు నువ్వన్నావ్ రాధ గురించి కథ రాయమని. అయితే ఆ కథలో రాధ అకారణంగా నిన్ను ద్వేషించింది గనక కథ అభూత కల్పనవుతుందావటాని. కాని బ్రదర్. నిజం తెలిసిం తర్వాత నేను రాధకి చేతులు జోడించాను తెలుసా?'

'ఏంజరిగిం దేవిటి?'

'రాధకి లంగ్ ఏప్సిస్‌ట. ఆమె బతుక్కి—గ్యారంటీలేదని నిన్ను దూరంచేసుకుంది,'

ప్రసాదం నిశ్చేష్టుడయ్యాడు.

'ఇది నిజమేనా?'

'కథ మాత్రం కాదు'

ప్రసాదం బొమ్మలా నించుండిపోయాడు! ●


ఫాస్ఫొమిన్,
శక్తిని పెంపొందించును
ఆకలిని అధికము చేయును
సహనశక్తిని
పెంచును,
శరీరముయొక్క రోగనిరోధక శక్తిని
ఎక్కువ చేయును



అవును—
కుటుంబము అంతటికి
ఫాస్ఫొమిన్
వల్ల ఆరోగ్యము కలుగును




ఫాస్ఫొమిన్...బి కాంప్లెక్స్ విటమినులు మల్టిపల్ గ్లిసరోఫాస్ఫేట్లుగల అతుపచ్చని పండ్ల రుచిగల టానిక్.

SQUIBB® SARABHAI CHEMICALS

shilpi sc 50/67Tel.

సపట్ లోషన్




తామర, గజ్జి, చిడుములకు నమ్మకమైన మరియు పేరుగాంచిన మందు.

SAPAT & CO., BOMBAY 2

ఏజెంట్లు: ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్
ఐకింగ్‌హాం పేట, విజయవాడ—2.